క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ గిరిజన కాలనీ, వెంకటేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్సీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇవ్వాలి

నెల్లూరు(పొగతోట): రాష్ట్రంలో ఎస్సీలకు 50 ఏళ్లకు పింఛన్లు మంజూరు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజాసత్త నాయకుడు శోభన్‌బాబు కోరారు. ఈ మేరకు నగరంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారికి బుధవారం వినతి పత్రం సమర్పించారు.

రౌడీషీటర్లపై చర్యలకు వినతి

నెల్లూరురూరల్: నెల్లూరు నగరంలో రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత యశ్వంత్ సింగ్ కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో రాష్ట్ర హోమ్ మంత్రి అనితను కలిసి వినతిపత్రం సమర్పించారు.

కాకాణితో భేటీ



కాకాణి గోవర్ధన్‌రెడ్డితో రజత్‌కుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివుని నరసింహారెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ నేతలు కలువ బాలశంకర్‌రెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, లీగల్ సెల్ కోవూరు అధ్యక్షుడు చెంచురెడ్డి పాల్గొన్నారు.

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక గిరిజన కాలనీలో పోషకాహార ఆవశ్యకతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ గర్భిణులు పోషకాహార లోపం తలెత్తకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలుండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, జామకాయ, వేరుశనగ చిక్కీ, బెల్లం, పాలకూర, పొనగంటాకు తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డా ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎ.అమరావతి, హెల్పర్ లావణ్య పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న పరిమళ

వెంకటాచలం: స్థానిక క్లస్టర్ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపడతామని డీసీహెచ్‌ఎస్ పరిమళ పేర్కొన్నారు. వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరైన వైద్యసేవలను అందించడంలేదనే ఆరోపణలొస్తున్న నేపథ్యంలో ఆకస్మికంగా బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. అన్ని వార్డుల్లో తిరిగి అక్కడ ఉన్న రోగులతో ముచ్చటించారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సమయపాలనను వైద్యులు, సిబ్బంది తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వేడుకగా కాంతమ్మతల్లి ఆరాధనోత్సవం



పొదలకూరు: మండలంలోని ఇనుకుర్తి పంచాయతీలోని కాంతమ్మ తల్లి ఆశ్రమంలో ఆరాధనోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఇనుకుర్తి, ముదిగేడు, గేడపూడిలో గ్రామోత్సవాన్ని జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. అఖండ భజనను నిర్వహించారు. ఇంద్రజాల, భరతనాట్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- లో-ఓల్టేజీ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి
- ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్(టెక్నికల్) గురవయ్య



మాట్లాడుతున్న గురవయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నిరంతర విద్యుత్ సరఫరాకు సిబ్బంది ఎల్లప్పుడూ చర్యలు చేపట్టాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్(టెక్నికల్) కె.గురవయ్య ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ స్కాడా కార్యాలయంలో నెల్లూరు రూరల్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మంచి సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు, రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఈనెల 30వ తేదీలోపు విద్యుత్ అధికారులందరూ సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టి ఫెయిల్యూర్స్ రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతర అంతరాయాల వల్ల విద్యుత్ సంస్థకు చెడ్డపేరు వస్తోందని, అంతరాయాలు కలుగకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ సెక్షన్ ఆఫీసర్‌పై ఉందని వివరించారు. లో-ఓల్టేజీ సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్క్ ఆర్డర్స్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు సబ్‌స్టేషన్లను తరచూ తనిఖీ చేస్తూ ఉండాలని, గృహ వినియోగదారులకు అదనపు విద్యుత్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ కలిగిస్తున్న దీనిపై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ చౌర్యం, అడిషనల్ లోడ్‌లను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సంస్థకు చెడ్డపేరు తీసుకొచ్చే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఈ విజయన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రభాకర్, రాము, సుబ్రహ్మణ్యం, సురేష్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు సుబ్బారావు, ఏడుకొండలు, ఏఈలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా కాలువల పూడికతీత



ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రెయిన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా చేపట్టేలా పర్యవేక్షించాలని కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆదిత్యనగర్, స్వామిదాసు స్కూల్ తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు ప్రవాహం ఆగి ఉండటాన్ని గుర్తించి, వెంటనే పూడికతీత చేపట్టాలన్నారు. అన్ని డివిజన్లలో కాలువలపై నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను గుర్తించి యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకునేలా నోటీసులు జారీ చేయాలన్నారు.

ఇసుక రవాణాలో జాగ్రత్తలు తీసుకోండి

భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక, మట్టి, డెబ్రిస్ తదితర సామగ్రి రవాణా సందర్భంలో లారీలు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లు, ఎద్దల బండ్ల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. మాగుంట లేఅవుట్ వద్ద రవాణా చేస్తున్న ఇసుక వాహనాలను ఆపి ఆయన మాట్లాడారు. రవాణా సమయంలో ఇసుక రోడ్లపై పడకుండా చూసుకోవాలన్నారు. ఇసుక, ఇతర సామగ్రి రవాణా సమయంలో నిర్దేశించిన ప్రమాణాలను పాటించకుండా, రోడ్లపై వెదజల్లితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అనంతరం చిల్డ్రన్స్ పార్కును సందర్శించారు. పార్క్ ప్రధాన మార్గం, పరిసర ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు జరపడాన్ని గమనించి వారికి పలు సూచనలు చేశారు. ఏసీనగర్ ప్రాంతంలో మున్సిపల్ క్వార్టర్‌ను పరిశీలించి క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో మురుగునీటి కాలువల్లో వ్యర్థాలను తొలగించే ఎక్స్‌వేటర్ పనితీరును పరిశీలించారు.

ల్యాబ్ పరీక్షలు పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు రోగులకు చేస్తున్న టీబీ, రక్త తదితర పరీక్షలను పక్కాగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. సంతపేటలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అన్ని పీహెచ్‌సీలు, జీజీహెచ్‌లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ నివారణకు కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త భారత్ అనే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఐదేళ్ల క్రితం, మూడేళ్ల క్రితం టీబీ వచ్చిన వారి సన్నిహితులు, స్మోకర్స్, డయాబెటిక్‌తో ఉన్న వారు, పోషకాహారం లోపంతో బాధపడుతున్న వారు, హెచ్ఐవీతో బాధపడుతున్న వారిని గుర్తించి క్షయ పరీక్షలు నిర్వహించాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి తగిన చికిత్స ఇవ్వాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ నూతనంగా అందరికీ ల్యాబ్ రికార్డులు, సామగ్రి ఇచ్చామన్నారు. లక్ష్యాల మేరకు రక్తపరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ సబ్ యూనిట్ అధికారి జయరామ్, నెల్లూరు సబ్ యూనిట్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న వర్క్‌షాపు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ పాలిటెక్నికల్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు తిరుపతిలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియాను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాషా, ఉపాధ్యక్షులు శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ బజార్ ప్రారంభం



నెల్లూరు(బారకాసు): కళాంజలి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇందులో చేనేత, ఖాదీ వస్త్రాలు, కలంకారి, మంగళగిరి చీరలు, కాశ్మీర్‌టాప్స్, బెంగాలి కాటన్, బనారస్, వెంకటగిరి జరీ చీరలు, తమిళనాడు బెడ్‌షీట్స్ తదితరాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. అంతేకాకుండా హైదరాబాద్ ముత్యాలు, కొండపల్లి బొమ్మలు, జైపూర్ చెప్పులు, రాజస్తాన్ గాజులు, పింగాణి వస్తువులను కూడా తమ క్రాఫ్ట్ బజార్‌లో అందుబాటులో ఉంచామని వివరించారు. ఈ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు.

కాలంచెల్లిన ఆహార పదార్థాల సీజ్

నెల్లూరు(బారకాసు): కాలం చెల్లిన పలు ఆహార పదార్థాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఓ వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి నగరంలోని వేదాయపాళెంలో ఉన్న రిలయన్స్ స్మార్ట్ షోరూమ్‌లో పలు ఆహార పదార్థాలను బుధవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో పలు ఆహార పదార్థాలను కాలం చెల్లినవిగా గుర్తించి వాటిని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 ప్రకారం సీజ్ చేశామని, అలాగే తదుపరి చర్యలు చేపడుతామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రణుతిఫ్లోరాతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్స్ భవనంలో గురుపూజోత్సవం రేపు

నెల్లూరు(బారకాసు): స్థానిక భక్తవత్సల నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సంక్షేమ భవనంలో శుక్రవారం గురు పూజోత్సవం (టీచర్స్‌డే) వేడుకలు నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక సర్వసభ్య సమావేశంతో పాటు రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు కూడా జరుగుతాయని తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వితపు బాల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ప్రభుదాస్‌లు హాజరవుతారన్నారు. 65 ఏళ్లు దాటిన విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం చేస్తామన్నారు.

మర్యాదపూర్వకంగా..



మాజీ ఎంపీ ఆదాలను సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని బుధవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్, జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి గంగసాని లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆదాలకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీ సునంద ఉన్నారు.

పండగలా ప్రవక్త జన్మదినం

నెల్లూరు(బారకాసు): మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పండగలా జరుపుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. కోటమిట్టలోని యూసుఫియా మసీదులో మత పెద్దలతో బుధవారం ఆయన సమీక్షించారు. నెల్లూరులో 40 ఏళ్ల నుంచి ఈ పర్వదినాన శాంతి ర్యాలీ నిర్వహిస్తారని, ఇందులో కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాఫర్ షరీఫ్, మొయినుద్దీన్, నన్నే సాహెబ్, రియాజ్, హయాత్ బాషా, ఖలీల్, జాఫర్ మొహిద్దీన్, కాలేషా, ఇక్బాల్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో నిందితులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట రావిచెట్టు సెంటర్‌కు చెందిన కృష్ణ శివగిరి కాలనీలో చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీన శివగిరి కాలనీలో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు కృష్ణ వెళ్తుండగా మా బొమ్మ వద్ద నీకేమి పనిరా అంటూ స్థానికుడు పెంచలయ్య తన అనుచరులతో కలిసి అడ్డుకున్నాడు. ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీనిని మనస్సులో పెట్టుకున్న పెంచలయ్య ఈనెల 2వ తేదీ రాత్రి తన అనుచరులతో కృష్ణ ఇంటికి వెళ్లి అతనిపై దాడిచేశారు. అడ్డుపోయిన కృష్ణ భార్య, తల్లిని తోసేశారు. ఈమేరకు బాధితుడు బుధవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానం



అరుణ(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఓల్డ్ పోలీస్ కాలనీకి చెందిన కొణిదెల అరుణ(65) బుధవారం ఆమె నివాసంలో మృతిచెందారు. కుటుంబ సభ్యురాలు మేకల శారద మృతురాలు అరుణ నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ అరుణ నేత్రాలను సేకరించి ఆమె కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయాల్సిన తన నంబర్ 99595 89321కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నివర్గాల సంక్షేమంపై దృష్టి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామ పంచాయతీలు పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మహిళా స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలకు సంబంధించి థీమ్-9పై శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించి, మహిళలు, బాలిక స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలను థీమ్-9లో పొందుపరిచారన్నారు. సమాజంలో మహిళల పాత్రను గుర్తించి, వారి భద్రత, అభివృద్ధికి సహకరించే విధంగా గ్రామ పంచాయతీలు పనిచేయాలన్న దిశగా మహిళా స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామన్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారత, లింగ వివక్షత లేకుండా చూడడం, బాల్య వివాహాలను నిర్మూలించడం, మహిళలు, బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, లింగ ఆధారిత హింసను నిరోధించడం మహిళా గ్రామసభల ఏర్పాటు, లింగ ప్రతిస్పందన ప్రణాళిక, నిధుల కేటాయింపు తదితర అంశాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి



సూపరింటెండెంట్ మాధవిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు



సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రవికుమార్

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, కార్యదర్శి సందానిబాషా కోరారు. సర్వజన ఆస్పత్రికి నూతనంగా రెగ్యులర్ మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ మాధవిని బుధవారం యూనియన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి, బొకే అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో డాక్టర్లు సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు. అలాగే రోగులకు అవసరమైన అన్నిరకాల పరీక్షలు త్వరగా చేసేలా, వీల్‌చైర్లు, స్ట్రెచర్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. మెరుగైన వైద్యసేవలందించేందుకు యూనియన్ పరంగా పూర్తి సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణయ్య, మోహన్‌రాజు, సామెల్, ధనశేఖర్, సురేష్, లవకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

– ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పూర్తిస్థాయి మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.మాధవిని బుధవారం ఆస్పత్రిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చేమూరు రవికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయనతో పాటు కంటి కార్నియా సేకరణ టెక్నీషియన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



నెల్లూరు(బారకాసు): స్థానిక రంగనాయకులపేటలో కొలువైన తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు మూడో రోజు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం తిరుమంజనం, హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే 11 గంటలకు దేవస్థానం సన్నిధిలో పవిత్ర సమర్పణ, సాయంత్రం 5.30 గంటలకు గోపురోత్సవం, హోమాలు చేశారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ సేవలను చేరువ చేయాలి



నెల్లూరు(బారకాసు): మున్సిపల్ సేవలు ప్రజలకు చేరువయ్యేలా జోన్లవారీగా అధికారులను కేటాయించి నిరంతరం పర్యవేక్షించనున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ పరిధిలో ఏడుగురు అధికారులను జోనల్స్ ఇన్‌చార్జిలుగా మున్సిపల్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు పర్యవేక్షకులుగా నియమించామని తెలిపారు. త్వరలో రూరల్ నియోజకవర్గంలో కూడా జోన్లవారీగా అధికారులను నియమించి మున్సిపల్ సేవలు ప్రజలకు చేరువయ్యేలా పర్యవేక్షించనున్నామన్నారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని ఆదేశించారు. అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారీగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు నూతన వ్యాపారాలను గుర్తించి ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని డివిజన్లలో 14 రోజులకోసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారీ, గంబుజియా చేప పిల్లల పెంపకం తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ టీపీఆర్ఓ వాసుబాబు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, హార్టికల్చరల్ అధికారి నరసింహారావు, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని నవాబుపేట పుల్లమ్మసత్రం వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను బుధవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మహిళల కోలాటం, ప్రత్యేక భక్తి పాటలు, పండరి భజనల నడుమ ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారికి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అతిచిన్న వయస్సు (నాలుగున్నరేళ్ల)లో అంతర్జాతీయ చెస్ సమాఖ్యలో బ్లడ్జ్ రేటింగ్ (1419) సాధించి ప్రపంచ రికార్డు సాధించిన జి.షాన్విక్‌రాజ్‌ను ఏపీ చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ బుధవారం అభినందించారు. గౌతమీ నగర్‌లోని ఆర్ఎల్ చెస్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారిని పలువురు సన్మానించారు. బాలుడి తల్లిదండ్రులు ప్రదీప్‌రాజ్, అనూష, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.